పేదలను దోచుకుంటున్న కేంద్ర ప్రభుత్వం


ఉప్పల్ రింగ్ రోడ్డులో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ..


బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం పెరిగిన గ్యాస్‌కు నిరసనగా ధర్నా చేస్తున్న మహిళలు

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తోందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ ఉప్పల్ చౌరస్తాలో గురువారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆధ్వర్యంలో చిలుకానగర్ నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల బతుకుల్లో వెలుగు నింపితే కేంద్ర ప్రభుత్వం వారిని దోచుకుంటోందని అన్నారు. గ్యాస్ ధరలతో పాటు అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాడూరి శ్రీనివాస్, బన్నాల ప్రవీణ్, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించే వరకు పోరాటం

బోడుప్పల్: పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించే వరకు పోరాటం చేస్తామని బీఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. గ్యాస్ ధరలు పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళలు గ్యాస్ సిలిండర్లతో నిర్వహించిన ధర్నాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు కొత్త శ్రీవిద్యగౌడ్ మహేశ్వరి, సింగిరెడ్డి పద్మారెడ్డి, చీరాల నర్సింహ, నేతలు మీసాల కృష్ణ, పులకండ్ల జంగారెడ్డి, దానగల్ల యాదగిరి, బందారం శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదల పొట్టగొడుతున్న మోదీ ప్రభుత్వం

మేడిపల్లి: కేంద్ర ప్రభుత్వం పేదల పొట్టగొట్టి పెద్దలకు దోచిపెడుతోందని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వరంగల్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆఎస్ నాయకులు పాల్గొన్నారు.

బతుకు భారం..

కుషాయిగూడ: మోదీ పాలనలో సామాన్యుడి బతుకు భారమైందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్ ధరలను నిరసిస్తూ చర్లపల్లిలో నిరసన చేపట్టారు.

పేదలను దోచుకుంటున్న కేంద్రం

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి పేదలను దోచుకుంటోందని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ మల్లాపూర్ చౌరస్తాలో ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాండ వాసుగౌడ్ పాల్గొన్నారు.


ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న
పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి తదితరులు


చర్లపల్లిలో నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో శుక్రవారం కరెంటు ఉండదని ఏఈ సీహెచ్ అర్చన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ అణుపురం ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్, అణుపురం, ఎల్ఐజీ, రాధిక-మౌలాలి మెయిన్ రోడ్డు, ఎంఐజీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నేరెడ్‌మెట్ ఫీడర్ పరిధిలోని అణుపురంకాలనీ, ఎల్ఐజీ-బీ పార్టు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు, బీఎస్ఎన్ఎల్ ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్, అణుపురం, ఎల్ఐజీ, రాధిక-మౌలాలి మెయిన్ రోడ్డు, ఎంఐజీ, కాప్రా జీహెచ్ఎంసీ ఆఫీసు, మహేష్‌నగర్ పార్టు, మెయిన్‌రోడ్డు ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్డు, కమలానగర్ పార్టు, అయ్యప్ప స్వామి టెంపుల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు ఉండదని తెలిపారు.

అభివృద్ధికి కృషి చేస్తా


కురుమానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ కురుమనగర్, లక్ష్మీనరిసింహ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానికులతో కలిసి కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అబ్బయ్య, దుర్గం నవీన్, గోవింద్ కుమార్ స్వామి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్ యాదవ్, జంపు గోవర్ధన్, పి.రామచంచందర్, రాజు, రమేష్ ఎల్లయ్యగౌడ్ ఉన్నారు.

ప్రచారమే తప్ప అభివృద్ధి శూన్యం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: నియోజకవర్గంలో ఆర్భాటపు ప్రచారమే తప్ప అభివృద్ధి శూన్యమని, కౌకూర్‌లో కనీస సౌకర్యాల కల్పనలో పాలకులు విఫలమయ్యారని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా గురువారం కౌకూర్‌లోని హరిజనబస్తీ, పెన్షన్‌పుర, సంజయ్‌గాంధీనగర్‌లలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను ఆయన తెలుసుకున్నారు. కౌకూర్‌లో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను ప్రజల వైద్యం కోసం బస్తీ దవాఖానాగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. మల్కాజిగిరి నియోజవర్గంలో ఒక డిగ్రీ కళాశాల, ఒక స్టేడియం కూడా లేదన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి రక్షించాలని అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, సీఎల్.యాదగిరి, నిమ్మ అశోక్‌రెడ్డి, దూళి రమేష్, పాండు, రాజలింగం, డివిజన్ అధ్యక్షులు పవన్, సత్యనారాయణ, శ్రీనివాస్, మల్లేష్, నాందాస్, శ్రీనివాస్, శంకర్, మహిళా నాయకులు వీనస్‌మేరీ, పద్మ, ఆషారాణి, సెమీనా తదితరులు పాల్గొన్నారు.

హామీలు మరిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం

రామంతాపూర్: రామంతాపూర్ డివిజన్ టీవీ స్టూడియో నల్ల పోచమ్మ ఆలయం నుంచి టీపీసీసీ సభ్యులు వినోద్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ జోడో యాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి హాజరై జోడో యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేకల శివారెడ్డి, పసూల ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, పత్తి కుమార్, రఫిక్, మల్లిఖార్జున్‌గౌడ్, సుధాకర్, జై.నవీన్, భాస్కర్‌రెడ్డి, అంజయ్య, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధాకరొశెట్టి పాల్గొన్నారు.


కౌకూర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న
డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

ఆలయ నిర్మాణానికి విరాళం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి దేవాలయానికి మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి రూ.3,01,116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి దేవాలయ అధ్యక్షుడు విజయకుమార్‌గుప్తా, నాయకులు తూముకుంట్ల శ్రీధర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మేయర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు చంద్రమౌళి, వీరన్న, రఘురామ్, పాండు, భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకులు, అశోక్, కాలనీవాసులు పాల్గొన్నారు.


మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న
దేవాలయ కమిటీ సభ్యులు

ఆలయ అభివృద్ధికి సహకారం

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌లో పెరుమాళ్ల ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష చెక్కును గురువారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెరుమాళ్ల ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహకారం ఎల్లప్పుడూ అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లం, రాజేష్, వెంకటేష్, రూకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శతచండీ యాగం

గౌతంనగర్: వాణీనగర్ విజయ వినాయక ఆలయంలో మహారుద్ర సహిత శతచండీ యాగం భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. బుధవారం ఉదయం 6:30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, అంకురార్పణ, గణపతి మూల మంత్రజపం, రుద్రాభిషేకం, గణపతి హోమం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. శతచండీ యాగం 7వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు.

బీజేఆర్‌నగర్‌లో నీటి ఎద్దడికి చెక్

మల్కాజిగిరి: బీజేఆర్ నగర్‌లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బీజేఆర్ నగర్‌లో జలమండలి జీఎం సునీల్‌కుమార్, సీజీఎం సుజాతతో కలిసి గురువారం పర్యటించారు. తాగునీరు ప్రెషర్‌తో రావడం లేదని, యూజీడీలో పైపులైన్లు పాతవి కావడంతో మ్యాన్ హోల్స్ నిండి రోడ్డుపై పారుతున్నాయని అన్నారు. 150ఎంఎం పైపులైన్ పనులు జరుగుతున్నాయని, పూర్తికాగానే తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండవని కార్పొరేటర్ తెలిపారు. యూజీడీ పైపులైన్ సామర్థ్యం కూడా పెంచుతామన్నారు. కార్యక్రమంలో బాబు, రంగమ్మ, వాజిద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆశీర్వచనం



హబ్సిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి నివాసంలో ఉప్పల్ కనిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం వేద పండితులు, దేవాలయ చైర్మన్ శ్రీనివాస్, కృష్ణమాచారి ఆధ్వర్యంలో గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి ఆశీర్వచనం చేశారు. మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కాసం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్లూక్రాస్‌లో స్వచ్ఛంద సేవ

సాక్షి, సిటీబ్యూరో: శునకాలకు ఆశ్రయం అందించే బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఆవరణలో మార్స్ పెట్‌కేర్‌కు చెందిన ఉద్యోగులు స్వచ్ఛంద సేవ నిర్వహించారు. దీనిలో భాగంగా షెల్టర్స్‌ను శుభ్రపరచి, శునకాలకు స్నానం చేయించడం, ఆహారం తినిపించడం, వాకింగ్‌కు తీసుకెళ్లడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్స్ ఎండీ సలీల్ మూర్తి మాట్లాడుతూ కొన్నేళ్లగా బ్లూక్రాస్‌తో, అక్కడ ఆశ్రయం పొందుతున్న మూగజీవులతో అనుబంధం ఉందన్నారు.

కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బోడుప్పల్: విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేటప్పుడు, ఇంటికి వచ్చేటప్పుడు కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో గురువారం కుక్కల నుంచి ఎలా తప్పించుకోవాలనే విషయంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలు రోడ్డుపై ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు, వార్డు ఆఫీసర్ హరిబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


గౌరీశంకర్ (ఫైల్)

అల్వాల్: కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్‌లో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యనగర్‌కు చెందిన గౌరీశంకర్(38) గురువారం వెస్ట్ వెంకటాపురం రైల్వే గేటు వద్ద రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సమస్యలే ఆత్మహత్యకు గల కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు.

అతి తక్కువ ధరలకే నాణ్యమైన మందులు

గౌతంనగర్: దేశంలోని అనేక ప్రాంతాల్లో జన్ ఔషధీ దివస్ జరుపుకోవడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు అన్నారు. గౌతంనగర్‌లో గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రధానమంత్రి జన్ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ధరలకే నాణ్యమైన మందులు అందిస్తున్న గోపు రమణారెడ్డిని ఆయన అభినందించారు. బీజేపీ నాయకులు ఆర్కే శ్రీనివాస్, గిరివర్ధన్‌రెడ్డి, సదానందగౌడ్, వాసంశెట్టి శ్రీనివాస్, లక్ష్మణ్, బండారి రవి, బలరాం, అమర్ పాల్గొన్నారు.

ఎన్‌జీఆర్ఐలో సైన్స్ దినోత్సవం


మాట్లాడుతున్న ప్రొ.సంజిత్ మిత్ర,
ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్

ఉప్పల్: ఉప్పల్ జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్) సంస్థలో గురువారం సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుణే సావిత్రి బాయిపూలే యూనివర్సిటీ ప్రొ. సంజిత్ మిత్ర హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సంజిత్ మిత్ర మాట్లాడుతూ గురుత్వాకర్షణ తరంగ డిటెక్టర్లను అభివృద్ధి చేయడంలో ఇటీవలి సంవత్సరంలో అద్భుతమైన పురోగతిని సాధించినట్లు తెలిపారు. గురుత్వాకర్షణ తరంగం భవిష్యత్‌లో మరిన్ని శాస్త్రీయ అన్వేషణలకు దోహదపడుతుందన్నారు. విశ్వంలో మరిన్ని రహస్యాలను ఛేదిస్తుందని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి తదుపరి తరంగ డిటెక్టర్లు రూపొందించడానికి భారీ ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అనంతరం ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్ మాట్లాడుతూ భూకంప పుట్టుక అర్థం చేసుకోవడంలో, ప్రమాదాల ఉపశమన చర్యల్లో ముఖ్యమైన పాత్రను ఎలా పోషిస్తాయో వివరించారు. హైడ్రో కార్బన్, ఖనిజ, భూగర్భ జలాల అన్వేషణ వంట వనరుల పరిశోధన అంశాలను ఆయన ప్రస్తావించారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి భూఉష్ణశక్తి, షేల్ గ్యాస్, లిథియం అన్వేషణపై ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయండి


వెంకటాపురంలో అభివృద్ధి పనులను
పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబితకిషోర్

అల్వాల్: అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబిత కిషోర్ అన్నారు. డివిజన్ పరిధిలోని న్యూగ్రామర్స్ పాఠశాల వద్ద రూ.16 లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, సంతోష్, మల్లేష్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, విజయశేఖర్, శ్రీనివాస్, పెంటారెడ్డి, జనార్దన్, మన్ను యాదవ్, ప్రభాకర్, మల్లేష్, బాలనర్సింహ, స్వప్న, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించండి

గౌతంనగర్: అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని మల్లికార్జునగర్‌లో రూ.36 లక్షలతో కొనసాగుతున్న ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను గురువారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, ఏఈ దివ్యజ్యోతి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తదితరులు ఉన్నారు.


మల్లికార్జునగర్‌లో అభివృద్ధి పనులను
పరిశీలిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతయాదవ్

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

మేడిపల్లి: కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు రెండో విడతలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమలానగర్‌లో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి గురువారం శిబిరాన్ని ప్రారంభించారు. కమిషనర్ డాక్టర్ పి.రామకృష్ణారావు, కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి, సుభాష్ నాయక్, భీంరెడ్డి నవీన్‌రెడ్డి, బచ్చరాజు, ఎంపల్లి అనంతరెడ్డి, కొడె పోచయ్య, బీఆర్ఎస్ అధ్యక్షురాలు నిర్మల, జావీద్ ఖాన్, ఇర్ఫాన్, మాడుగుల చంద్రారెడ్డి, మనోరంజన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, డీఈఈ శ్రీనివాస్, డాక్టర్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు..


బాలుడిని తల్లిదండ్రులకు
అప్పగిస్తున్న పోలీసులు

అల్వాల్: ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని రెండు గంటల్లో పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. నేరెడ్‌మెట్ సీఐ నర్సింహస్వామి వివరాల ప్రకారం.. డిఫెన్స్ కాలనీలో నివాసం ఉండే పి.నివాస్(09) స్థానికంగా డీఏవీ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక ఇంట్లో నుంచి గురువారం ఉదయం పారిపోయాడు. తల్లిదండ్రులు స్థానికంగా గాలించినా ఆచూకీ లభించకపోవడంతో నేరెడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని రెండు గంటల్లో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఫారెన్ సిటీ ఎగ్జిబిషన్ ప్రారంభం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మేడిపల్లి చంగిచర్ల ఎక్స్‌రోడ్డులోని ఏవీ మైదానంలో నగరంలోనే మొదటిగా భారీ సెట్టింగ్‌లతో నిర్వాహకులు నూర్ మహ్మద్ ఏర్పాటు చేసిన ఫారెన్ సిటీ ఎగ్జిబిషన్‌ను గురువారం మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఉత్పత్తులపై పోలీసుల దాడులు

సుమారు రూ.3 లక్షల సరుకులు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న
నకిలీ ఉత్పత్తులు, నిర్వాహకులు

కుషాయిగూడ: నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్న ఓ దుకాణంపై పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి లక్షల విలువైన సరుకులను స్వాధీనం చేసుకొని నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్, మ్యారీకో లిమిటెడ్‌కు సంబంధించిన ఉత్పత్తులను నకిలీ చేసి విక్రయిస్తున్నారనే సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు కుషాయిగూడలోని దుకాణంపై ఆకస్మిక దాడులు చేశారు. నిర్వాహకులు రాజు సింగ్, మంగళ భగవాన్‌రామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.3 లక్షల విలువైన ప్యారాషూట్ నూనె బాటిళ్లు, సర్ఫ్‌ఎక్సల్, వీల్ సర్ఫ్, తాజ్‌మహల్, రెడ్‌లేబుల్ టీ పౌడర్ ప్యాకెట్లు, షాంపూలు తదితర వాటితో పాటు ప్యాకింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీకి చెందిన అనిల్‌కుమార్, రాజస్థాన్‌కు చెందిన శ్రావణ్‌సింగ్ వీరికి ఈ ఉత్పత్తులను సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు.

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శ్రీచైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఉప్పల్ డిపో వద్ద గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను ప్రభుత్వం అడ్డుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న వరుస ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని, విద్యార్థుల మరణాలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ అన్వర్, జిల్లా నాయకులు హరీష్, మహేష్, వినయ్, శివ, మనోహర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

మల్కాజిగిరి: విద్యార్థుల ఆత్మహత్యకు కారణమైన కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ మల్కాజిగిరి నాయకులు డిమాండ్ చేశారు. ఆనంద్‌బాగ్ క్రాస్‌రోడ్స్‌లో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిల్‌సింగ్, నవీన్, సుమన్, సంతోష్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి

మల్లాపూర్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారిని వేధిస్తున్న విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బొజ్జ రాకేష్ అన్నారు. నాచారంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

శ్రీచైతన్య కళాశాలలో ఫీజుల భారం తట్టుకోలేక అనేక మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందజేయాలన్నారు.


ఉప్పల్ డిపో వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



ఆనంద్‌బాగ్‌లో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు